## పాఠము - 28

# దుశ్శకున (అపశకున) దర్శనము

ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధముగా ప్రబోధించెను:

أَلَآ إِنَّمَا طَٰٓئِرُهُمْ عِندَ ٱللَّهِ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ ﴿١٣١﴾

**"నిశ్చయముగా వారి అపశకునం అల్లాహ్ అధీనంలో ఉంది. కాని వారిలో చాలా మంది జ్ఞానహీనులు." *(7:131)***

قَالُوا۟ طَٰٓئِرُكُم مَّعَكُمْ ۚ أَئِن ذُكِّرْتُم ۚ بَلْ أَنتُمْ قَوْمٌ مُّسْرِفُونَ ﴿١٩﴾

**అప్పుడు ప్రవక్తలు ఇలా అన్నారు: "మీ దరిద్రమంతా మీ వెంటే ఉంది,[20] ఏమిటీ, మీకు చేసే ఉపదేశాన్ని మీరు దరిద్రంగా తలపోస్తున్నారా? అసలు విషయం అదికాదు. మీరసలు బరితెగించిపోయారు." *(36:19)***

హజరత్ అబూహురైరా (రజి అల్లాహు అన్హు) ఈ విధముగా ఉల్లేఖించారు: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధముగా ప్రబోధించెను: "ఏ వ్యాధీ అల్లాహ్ ఆజ్ఞ లేకుండా సోకదు. దుశ్శకునం అనేది లేదు. గుడ్లగూబ కూతలు కూడా ఏ విధమైన అపశకునానికి దారితీయవు. 'సఫర్' నెలలో కూడా ఏ విధమైన అపశకునం లేదు." *(సహీబుఖారి,సహీముస్లిం)*

సహీ ముస్లింలో ఈ పదములు, అధికముగా పొందుపరచబడెను.

**"నక్షత్రముల బెడద మరియు భూతముల బెడద అనేవి అవాస్తవములు."**

హజరత్ అనస్ (రజి అల్లాహు అన్హు) ఈ విధముగా ఉల్లేఖించెను: ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ విధముగా ప్రబోధించెను: "ఏ వ్యాధి కూడా అందరికీ అంటదు. దుశ్శకునం అనేది లేదు. నాకు 'ఫాల్' అంటే ఇష్టం. అప్పుడు అనుచరులు ప్రశ్నించారు: 'ఫాల్' అంటే ఏమిటి? అని."

"ఉత్తమమైన మంచి మాట" అని ప్రవక్త జవాబు ఇచ్చెను.

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) ఈ విధముగా ఉల్లేఖించెను: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను దుశ్శకునం గురించి ప్రశ్నించగా ఆయన ఈ విధముగా ప్రబోధించెను:

"వీటన్నింటికంటే ఉత్తమమైన మంచిమాట మేలైనది. అది ఏ ముస్లింని కూడా అతని విధి నుండి నివారించలేదు. అందుచేత ఎవరైనా చెడును చూచినప్పుడు ఈ దుఆ చదవవలెను: "ఓ అల్లాహ్! నీవు తప్ప ఎవరూ మేలు చేకూర్చలేరు. నీవు తప్ప ఎవరూ కీడును నిర్మూలించలేరు. నీ అనుగ్రహము లేనిదే మాకు మేలు చేకూర్చుకునే శక్తిగాని లేదా కీడు నుండి రక్షించుకునే శక్తిగాని లేదు." *(దీనిని అబూదావూద్ సహీ సనద్‌తో పొందుపరచెను.)*

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) నుండి హజరత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ఈ విధముగా ఉల్లేఖించెను:

"అపశకునమును విశ్వసించుట అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించుట. మనలో ఎవరు (సృష్టి కారణముగా కొన్ని అనుమానాలు కలిగినా) అల్లాహ్‌ను విశ్వసించి ఆయనపై నమ్మకము ఉంచిన కారణముగా అల్లాహ్ దానిని నిర్మూలించును." *(అబూదావూద్, తిర్మిజీ)*

హజరత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) ఈ విధముగా ఉల్లేఖించెను: "అపశకునం అని ఎవరైతే తన కార్యమును మానుకొనెనో అతడు షిర్క్ చేసెను" అని ప్రవక్త తెలిపినప్పుడు అనుచరులు దానికి పాప పరిహారము ఏమిటి అని ప్రశ్నించిరి. దాని పాప పరిహారము ఈ దుఆ "యా, అల్లాహ్! నీవు అనుగ్రహించు మేలు తప్ప వేరే మేలు లేదు. నీవు విధించు కష్టము తప్ప వేరేకష్టము లేదు, నీవు తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కారు." (ముస్నద్ అహ్మద్)

ముస్నద్ అహ్మద్‌లో హజరత్ ఫజల్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హుమా) ఈ విధముగా ఉల్లేఖించారని పొందపరచబడినది: "నిన్ను ఏదైనా పని నుండి నివారించునది లేదా ప్రోత్సహించునది దుశ్శకునము."

# దీనిలో 11 ప్రకరణములు కలవు

1. వాక్యములు (7:131) మరియు (36:19)ల భావము విశదీకరించి తెలుపబడెను.
2. అల్లాహ్ ఆజ్ఞ లేకుండా ఏ వ్యాధీ సోకదని స్పష్టపరచబడెను.
3. దుశ్శకునం అనేది ఒట్టి భ్రమ అని స్పష్టపరచబడెను.
4. గుడ్లగూబ కూతలతో అపశకునం వాటిల్లును అని భావించుట కూడా నిరోధించబడినది.
5. 'సఫర్' నెల అపశకునం కలదని భావించుట కూడా నిరోధించ బడింది.
6. ఉత్తమమైన మంచి మాటలు తెలుపవలెను.
7. చెడు మాటలు, మంచి మాటల గురించి విశదీకరించబడెను.
8. మనస్సులో ఏమైనా చెడు ఆలోచనలు వచ్చినప్పుడు అల్లాహ్‌ను విశ్వసించుట వలన అవి దూరమగును.
9. ఎవరికైనా మనస్సులో చెడు ఆలోచనలు వచ్చినప్పుడు హదీసులో తెలుపబడిన దుఆ, "యా, అల్లాహ్! నీవు తప్ప ఎవరూ మేలు చేకూర్చ లేరు. నీవు తప్ప ఎవరూ కీడును నిర్మూలించలేరు. నీ అనుగ్రహం లేనిదే మాకు మేలు చేసే శక్తి ఎవరికీ లేదు. లేదా కీడు నుంచి రక్షించుకునే శక్తిగాని లేదు" అని చదువవలెను.
10. అపశకునాలను భావించుట షిర్క్‌కు పాల్పడుట అని స్పష్ట పరచబడెను.
11. అపశకునం గురించి విశదీకరించి తెలుపబడెను.